# మళ్లీ ఏడాది బీఈడీ, ఎంఈడీ

- **పదేండ్ల తర్వాత తిరిగి పాత విధానం**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఏడాది వ్యవధి గల బీఈడీ, ఎంఈడీ కోర్సులు మళ్లీ అందుబాటులోకి రానున్నాయా..? గతంలో ఉన్న ఈ కోర్సులను మళ్లీ పునరుద్ధరిస్తారా..? అంటే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) వర్గాలు అవుననే చెబుతున్నాయి. ఈ మేరకు కొత్త ముసాయిదాను ఎన్సీటీఈ సిద్ధం చేసింది. పదేండ్ల తర్వాత పాత కోర్సులను పునరుద్ధరించనున్నది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సులు అమల్లోకి రానున్నాయి. వాస్తవానికి ఏడాది కాలపరిమితి గల బీఈడీ, ఎంఈడీ కోర్సులు గతంలో ఉండేవి. 2014లో తీసుకున్న నిర్ణయం మేరకు వీటి స్థానంలో రెండేండ్ల బీఈడీ, ఎంఈడీ కోర్సులు ప్రవేశపెట్టగా, తిరిగి మళ్లీ తీసుకురావాలని ఇటీవలే ఎన్సీటీఈ నిర్ణయించింది. ఏడాది బీఈడీ, ఎంఈడీ కోర్సులను ప్రవేశపెట్టినా రెండేండ్ల కోర్సులు యథావిధిగా కొనసాగుతాయి. ఏడాది ఎంఈడీని ఫుల్‌టైం కోర్సుగా, రెండేండ్ల ఎంఈడీని పార్ట్‌టైమ్‌గా అందుబాటులోకి తీసుకొస్తారు. ఈ పార్ట్‌టైమ్ కోర్సులో వర్కింగ్ ప్రొఫెషనల్స్ అంటే.. ఇప్పటికే పనిచేస్తున్న టీచర్లు, ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేటర్లు చేరవచ్చు. ఏడాది బీఈడీ కోర్సులో నాలుగేండ్ల డిగ్రీ(ఆనర్స్) పూర్తిచేసిన వారు మాత్రమే అర్హులు. మూడేండ్ల డిగ్రీ కోర్సు పూర్తిచేసిన వారు ఏడాది బీఈడీ కోర్సులో చేరేందుకు అనుమతించరు. ఒకవేళ నాలుగేండ్ల డిగ్రీ విద్యార్థి మూడేండ్లకే నిష్క్రమిస్తే ఆ విద్యార్థి రెండేండ్ల బీఈడీ కోర్సులో చేరాల్సి ఉంటుంది.

## జేఈఈలో గురుకుల విద్యార్థులకు ర్యాంకులు

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్-1లో రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ గురుకులాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు ఆయా సొసైటీలు బుధవారం ఒక ప్రకటన విడుదలచేశాయి. బీసీ గురుకులాల నుంచి 53 మంది ర్యాంకులను కైవసం చేసుకున్నారు.

## ప్రొఫెషనల్ కోర్సుల్లో 95శాతం సీట్లు మనోళ్లకే

- **నాన్ లోకల్ కోటా ఇక ఖతం**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో లోకల్, నాన్ లోకల్ కోటాపై ప్రభుత్వం చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. 95శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే కేటాయించాలని నిర్ణయించింది. ఇక మరో 5శాతం సీట్లను ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత గల ఉద్యోగుల పిల్లలకు కేటాయించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇదే జరిగితే నాన్ లోకల్ కోటా ఇకపై ఉండదు. ఇది వరకు ప్రొఫెషనల్ కోర్సుల్లో లోకల్, నాన్‌లోకల్ కోటా 85:15శాతంగా ఉంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే తెలంగాణ విద్యార్థులకు 10శాతం అదనంగా దక్కుతాయి. ఇక మరో 10 శాతం సీట్లను నేషనల్ ఇంటిగ్రేషన్ కోటాలో భర్తీచేస్తారు. ఈ సీట్లు సూపర్‌న్యూమరీ సీట్లు. వీటిని ఇప్పుడున్న సీట్ల సంఖ్యకు అదనంగా పెంచుతారు. అంటే 2025 -26 విద్యా సంవత్సరంలో అన్ని కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లు 10శాతం పెరుగుతాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోగా, త్వరలోనే జీవో జారీకానున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

## నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేయకముందే అడ్మిషన్లు తీసుకుంటే ఆయా కాలేజీలకు 2025 -26 గుర్తింపునివ్వబోమని ఇంటర్‌బోర్డు హెచ్చరించింది. పీఆర్వోలను నియమించుకుని, ముందస్తు అడ్మిషన్లు చేపట్టరాదని ప్రకటించింది.

## ఐదు నెలల తరువాత పోస్టింగ్‌లు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించి ఆ తరువాత తెలంగాణకు బదిలీ అయిన ఉద్యోగులకు ఎట్టకేలకు పోస్టింగ్ ఇచ్చింది. ఐదునెలల తర్వాత పలు శాఖల్లో పోస్టింగ్స్‌నిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో18ని జారీచేసింది. దశాబ్దకాలంగా ఏపీలో పనిచేస్తున్న 44 మంది తెలంగాణ స్థానికత గల ఉద్యోగులను తెలంగాణకు కేటాయించి, ఏపీ సర్కార్ రిలీవ్ చేసింది. అయితే వీరంతా రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు చేయగా, వీరికి పోస్టింగ్స్‌నివ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. టీఎన్జీవో సంఘం వినతి మేరకు వీరికి పలుశాఖల్లో పోస్టింగ్స్‌నిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

## 2027లో జమిలి ఎన్నికలు: చింతామోహన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : 2027లో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ వచ్చి కాసేపు అటూ ఇటూ తిరిగితే రాజకీయ రహస్యం తెలిసిపోయిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు ఆపి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో ఉన్న లక్షల కోట్ల దేశ సంపదనంతా గుజరాతీలకు, మార్వాడీలకు రుణాలుగా ఇస్తున్నాయని మండిపడ్డారు.

















